తను కూడా అదే కారులో తిరగ వల్సిన పిల్ల ఏం పెళ్లాం! కాలమైన'' స్వగతంలా అనుకున్నాడు కిళ్ళీ బడ్డితాత.

"ఏమిటి తాతా!" ఆశ్చర్యంగా అడిగాను నేను.

''యింటావా బాబూ!'' వేదాంతం చెప్తున్నట్టు అన్నాడు.

''యిప్పుడా గేదె కింద పడింది ... ఆ బుల్లి అకార్లో ఎల్లినాయనకి కూతురు కానేటి పేద్దాం? ఈ విజానికి సాచ్చంలేదు. మనసూలేదు. తండ్రి ఎవడయితేనేమి ఏం తల్లి అడు వదిమందిలో పెళ్ళి చేసుకున్న పెళ్ళాం కాదు. అందుకని యిదిక్కడ . అల్లిక్కడ" నేను నిజంగా మూర్ఛితుణ్ణయ్యాను.

ఆ కారులో వెళ్ళి నాయనకి నేనెవరో తెలియకపోయినా. ఆయనెవరో నాకు తెల్సు. ఆ వూళ్ళో పెద్ద వ్యాపారి. మంచి పలుకుబడి వున్న మనిషి. నాలుగయిదు వంశాలలో గౌరవసభ్యుడు. ఆయన తల్చుకుంటే ...సూటిగా కాకపోయినా ఎవరి ద్వారానయినా ఏ విధంగానయినా ఆ పిల్లకి అంతో యింతో సాయంచేయవచ్చు. ఆకు కోవచ్చు. తండ్రిగా కాకపోయినా. ధార్మికదృష్టిగానయినా ''మరి వాళ్ళమ్మ యింతకీ ఆయనకి సంగతి తెల్సా?'' అస్పష్టంగా అడిగాను.

అనుభవజ్ఞుడిలా నవ్వాడు తాత.

''అమ్మ! యిది పుట్టగానే సచ్చింది. బాబు .. అదూ చచ్చినట్టే దీని యిళయంలో .. ఎందుకంటే అదికి యిషయం తెల్సు. ఎలా తెల్సని అడక్కు బాబూ. తెలుసంతే'' ఏదో బాధతో అన్నాడతను.

నామనస్సు వేడెక్కిపోయింది.

"ఒరే! ఏమిట్రా అలా నిల్చుండిపోయావ్. యిక్కడ కూడా ఆలోచనలేనా.''

నేను ఎదురు చూచిన వ్యక్తి వచ్చి భుజం చరిచే వరికి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చానన్నను. అయితే పూర్తిగా కాదింకా.

''నువ్వు గుడిలోకి వెళ్ళి వచ్చావా?'' అడిగాడు.

''ఆఁ నువ్వుకూడా వెళ్ళిరా యిక్కడే నిల్చుంటాను.'' అన్నాన్నేను. వాడు వెళ్ళాడు అమ్మవారి దర్శనం చేసికుందుకు. అయితే ఈ సారక్కడ కనకమాలచ్మి లేదు. ఆ వెలితి నాకు మాత్రం కన్పించింది. ఆ క్షణంలో నేనాలోచిస్తున్న విషయం..

యిందాక ఆ కుర్రాణ్ణి రక్షించి గేదె పోటు తినడంలో కనకమాలచ్చికి లభించినదేమిటి?

పుణ్యమా?

ప్రత్యుపకారమా?

సానుభూతా!

కృతజ్ఞతా?

ఆ కార్లో ఆయన చూసిన చూపుకి అర్థం ఏమిటి?

కృతజ్ఞతా?

సానుభూతా?

అభిమానమా?

ఆఖరు ప్రశ్న. యింకా అక్కడే పడి వుంది కనకమాలచ్మి.

ఆమె బ్రతుకుతుందా?

బ్రతకాలా?

బ్రతకడమంటూ జరిగితేదేనికోసం?*